రేవతి - ఆది

నానాటి బ్రదుకు - నాటకము
కానక కన్నది - కైవల్యము

పుట్టుటయు నిజము - పోవుటయు నిజము
నట్ట నడిమి పని - నాటకము
ఎట్ట నెదుట గల - దీ ప్రపంచము
కట్ట కడపటిది - కైవల్యము

కుడిచేదన్నము - కోక చుట్టెడిది
నడుమంత్రపు పని - నాటకము
ఒడి గట్టుకొనిన - ఉభయకర్మంబుల
గడిదాటిన పుడె - కైవల్యము

తెగదు పాపము - తీరదు పుణ్యము
నగి నగి కాలము - నాటకము
ఎగువన శ్రీవేంక -టేశ్వరుడేలిక
గగనము మీదిది - కైవల్యము

జగత్తు అంతా మిధ్య అని వేదాలు ఉద్ఘోషిస్తున్నాయి. నరుల దినదినపు జీవన విధానమంతా మాయ అనే తెరవెనుక జరుగుతున్న నాటకమే. నైసర్గిక దృష్టితో చూడగలిగింది ఈ నాటకం మాత్రమే. జ్ఞాన దృక్కులతో, అంతర్ముఖమైన దృష్టితో మాత్రమే కైవల్య మార్గం గోచరిస్తుంది.

మానవ దృష్టికి, పంచేంద్రియ జ్ఞానానికి గోచరించేది అధిభౌతికమైన సాపేక్షమైన సత్యం అందువల్ల జనన మరణాలు (ఈ పరిధిలో) సత్యమే. జన్మాది మరణ పర్యంతం జరుగుతున్నది మట్టుకు నాటకమే. మనకు ప్రత్యక్షంగా త్రయీమానమై గోచరిస్తున్నది భౌతిక సృష్టి. దీనికన్న అతీతమైనది తురీయమైనది కైవల్యము.

ప్రాణికిగల క్షుద్బాధాదులు, మానవులకుండే వస్త్రధారణాది వ్యామోహాలు - ఇవన్నీ జనన మరణాల మధ్య జరుగుతున్న పనులు - ఇవన్నీ నాటకమే. మాతృ గర్భంలో ఉండగా

నే మూటగట్టుకొన్న ప్రారబ్ధ, సంచితములనే ఉభయ కర్మలవల్ల ఏర్పడే నిర్దిష్ట పరిధిని దాటగలిగితేనే కైవల్యము. లేనియెడ జీవునకు నాటకమే మిగులుతుంది.

ఇక మూడవ కర్మ - ఆగామి - ఉన్నది. దానివల్ల వచ్చే చిక్కులున్నవి. ప్రారబ్ధ సంచిత కర్మలు క్షయం కానీకుండా అడ్డువస్తున్నదది. శ్రీవేంకటేశ్వరుడనే ఆకాశమున్నది. ఆ తిరువేంకటాచలపతి జగదధీశ్వరుడు. ఆయనను చెందగలిగితే ఆ మీదట పొందగలిగినది కైవల్యమే. తన సర్వస్వమూ జీవులాస్వామికి అర్పిస్తే వారి వారి ప్రారబ్ధ సంచిత ఆగామి కర్మలు పూర్ణమై పరిపక్వమై ముక్తి లభిస్తుంది. లేకపోతే ఈ చర్విత చర్వణపు జనన మరణాల సంధిలో జీవుడు గింజుకుంటూనే ఉంటాడు యుగాంతందాకా అని అద్వైత వేదాంతపు జ్ఞాన వైరాగ్య మార్గాన్ని నిర్ధారించారు అన్నమాచార్యులు.